# సమస్యలూ పరిష్కారాలూ



కథా నిలయం
శ్రీకాకుళం

యర్రంశెట్టి శాయి

త్రీఫార్టీ లోకల్ కూతపెడుతూ పరుగెట్టింది.

ఆ శబ్దానికి పావనికి మెలకువ వచ్చేసింది. కళ్ళువిప్పి చుట్టూ చూసింది. తండ్రీ, తల్లీ, తమ్ముడూ, చెల్లాయీ గాఢంగా నిద్రపోతున్నారు. త్రీఫార్టీ లోకల్ ట్రైయిన్ కూతకు వారికెలా మెలకువ రాదో తనకెంత ఆలోచించినా అర్థంకాదు. తనకు మాత్రం ఎంతటి నిద్రలో వున్నా ఆ కూతకు ఇట్టే మెలకువ వచ్చేస్తుంది. తనకే కాదు- ఆ

బిల్డింగ్‌లో యింకా చాలామందికి కూడా మెలకువ వస్తుంది. కొంతమంది వాటాల్లో లైట్లు వెలుగుతాయి. మరి కొంత మంది ఇళ్ళల్లో నుంచి మాటలు విన బడతాయ్. ప్రతిరోజూ- ఆ లోకల్ కూతవల్ల- మూడు నలభై కే ఆనాటి కార్యక్రమాలు ప్రారంభమైపోతాయి చాలామంది ఇళ్ళల్లో. మరీ ఆ నాలు గంతస్తుల భవనం- రైల్వేట్రాక్‌ని ఆనుకునే ఉండటం వల్ల పగలూ, రాత్రుళ్ళుకూడా ప్లాట్‌ఫారం మీదే ఉన్నట్లుంటుంది. పై వాటాలో అడుగుల చప్పుడు వినబడసాగింది. అంటే రత్నాకర్‌కూడా నిద్రలేచా డన్నమాట! అతను సాధారణంగా

**పరమాత్ముడు**

అమ్మాయిల వెంటబడి ఏడిపిస్తున్న ఓ రోడ్‌సైడ్ రోమియోని పోలీస్ పట్టుకున్నాడు.

"అలనాటి ఆ శ్రీకృష్ణ పరమాత్ముడే గోపికలను ఏడిపించాడు. ఏం- ఆ పని నేను చేస్తే తప్పా?" అడిగాడు రోమియో.

"అలనాటి శ్రీకృష్ణుడే జైల్లో ఉన్నాడు, నువ్వంటే తప్పులేదు· పద.... పద.. జైలుకి" తెలివిగా చెప్పాడు పోలీస్.

—టి. చంద్రశేఖర్.

రోజూ తెల్లారుజామున నాలుగు న్నరకు వంట ప్రారంభిస్తాడు. కానీ ఒకోరోజు మాత్రం నిద్ర పట్టకో, ఏమో- త్రీఫార్టీ లోకల్ టైమ్‌కే ప్రారంభించేస్తాడు. లేచి తన పక్క మీదే కూర్చుంది పావని. నైట్‌బల్బ్ కాంతి ఎర్రగా అలుము కుంది, గదంతా.

"ఈ సంసారం నా వల్ల కాదు. మీ ఇష్టం! మీరేం చేసుకుంటారో చేసుకోండి!"

నిద్రలోనే కలవరిస్తోంది తల్లి.

పావనికి నవ్వొచ్చింది. అంతలోనే జాలి!

తన తండ్రికీ, ఆమెకూ ఒక్కక్షణం కూడా సరిపడదు. పెళ్ళీడు దాటి పోతున్న తన విషయం పట్టించు కోకుండా తాగుడుకలవాటు పడ్డాడని ఆమెకు కోపం. ఇంటికి రాగానే ఎలాగూ ఆమె పోట్లాట పెట్టుకుం టుందని తండ్రి ఫ్యాక్టరీ నుంచి సాయంత్రం ఇంటికి రాకుండా ఎక్కడెక్కడో తిరిగి, తాగి ఏ అర్ధ రాత్రికో ఇల్లు చేరుకోవడం అల వాటు చేసుకున్నాడు. వాళ్ళిద్దరూ పోట్లాడుకునే కొద్ది గంటలు తనకు నరకంగా ఉంటుంది. మరి తమ్ము డికి, చెల్లాయికి ఏమనిపిస్తుందో తెలీదు. తెలుసుకునే అవకాశంకూడా లేదు. అసలు ఉన్న ఆ ఒక్క

గదిలో ఒకరితో ఒకరు ఏకాంతంగా మాట్లాడుకునే అవకాశం ఏదీ? అన్నీ బహిరంగంగా కుటుంబ సభ్యులందరి ముందూ జరగాల్సిందే. బట్టలు మార్చుకోవడం, అలంకరించుకోవడం, భోజనం చేయడం, నిద్రపోవడం-

తామేకాదు! ఇది ఆ బిల్డింగ్‌తో ఉన్న ఎనిమిది వాటాల వాళ్ళ సమస్యే. అయినా ఎవ్వరూ, ఎప్పుడూ ఆ విషయం గురించి మాట్లాడరు. అసలు పట్టించుకున్నట్లే కనబడరు. అంతగా అలవాటు పడిపోయారు.

లేకపోతే ఏం చేస్తారు? ఆ మాత్రం ఇళ్ళు దొరకడమే సిటీలో చాలా కష్టం. దొరికినా తమ తాహతుకు సరిపడే అద్దెతో దొరకడం ఇంకా కష్టం. అదీ బాగా పాతబడిన బిల్డింగ్ కాబట్టి, ప్రాణంమీద తీపి ఉన్న వారెవరూ అందులో కాపురం ఉండడానికి ఇష్టపడరు కాబట్టి, తక్కువ అద్దెలోకి దిగిందది. లేకపోతే అదంత తక్కువ అద్దెకు దొరకటమా?

మిగతా రోజుల్లో పర్లేదుగానీ వర్షాకాలంలో మాత్రం అందరూ ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని ఉండాల్సిందే! బయట జోరున వర్షం పడుతుంటే, ఆ బిల్డింగ్ కాస్తా ఎక్కడ కుప్పగా కూలిపోతుందో నన్న భయంతో గడుపుతుంటారు. అయినా ఎవ్వరూ ఆ బిల్డింగ్ వదలిపోవటం లేదు. ఎన్నో ఏళ్ళుగా అందులోనే ఉంటున్నారు.

టైమ్ చూసింది పావని. అయిదవుతోంది.

ఇంక వంట ప్రారంభించాలి. ఏడు గంటలకల్లా తండ్రికి టిఫిన్ కారియర్ రెడీ అయిపోవాలి.

లేచి అందరినీ దాటుకుంటూ వంటింటిలోకి నడిచింది పావని. వంటిల్లు పేరుకే వంటిల్లు గానీ కాకిగూడులా ఉంటుందది. యిద్దరు మనుషులు నిలబడితే నిండిపోతుంది.

ఎక్కువ శబ్దాలు కాకుండా వంట మొదలుపెట్టిందామె. తల్లికి మరి కాసేపు నిద్రాభంగం అవకుండా

### లైట్ మారో

ఒక మోటారు సైకిలు, లారీ 'ఢీ' కొన్నాయి, రాత్రి పదిగంటలప్పుడు. "కళ్ళు కన్పించడం లేదా?" అంటూ లారీ డ్రైవర్ క్రిందకి దిగి వచ్చాడు. మోటార్ సైకిలిస్ట్ మాత్రం తాపీగా- "నాకేం తెల్సు లారీ అని. రెండు మోటార్ సైకిళ్ళు వస్తున్నాయనుకున్నాను." అని సమాధానమిచ్చాడు.

—కుల్సుమ్‌బీ.

ఉండాలని తన కోరిక. ఆమెకు నిద్ర దొరికేదే ఆ కాసిని గంటలు.

వంటింటి తలుపుమీద ఎవరో మీటిన శబ్దం-

చటుక్కున తలెత్తి చూసింది.

ఎదురుగ్గా రత్నాకర్ కనిపించాడు.

"ఏమిటి?" అనడిగింది పావని.

"కొంచం కారం ఉంటే ఇవ్వ- అది నిన్నే అయిపోయింది గాని నాకా విషయం గుర్తే లేదు."

పావని సీసాలోంచి కారం కొంచెం పేపర్లోకి వంచి, ఆ పొట్లాం అతని కందించింది.

"థాంక్యూ" అనేసి వెళ్ళి పోయా డతను.

అతన్ని చూస్తే నవ్వొచ్చిందామెకి. ఎప్పుడూ ఏదోకటి అప్పు అడుగు తూనే ఉంటాడు తనను. ఇంకెవ్వ రినీ అడగడు. ఇంకెవ్వరితోనూ మాట్లాడేంత చనువు కూడా లేదు. తను నైస్తు క్లాసు చదివేటప్పుడు తనకు అప్పుడప్పుడూ హిందీ పాఠం చెప్పేవాడు. అదే చనువు! ప్రొద్దున్నే లేచి వంట చేసుకోవడం- సెవెన్ ఫిఫ్టీన్ లోకల్‌లో ఫాక్టరీకి బయల్దేరడం- మళ్ళీ సాయంత్రం ఏడుగంటలకు ఇంటికి చేరుకొని వంట చేసుకొని భోజనం చేయడం- ఇదీ అతని కార్యక్రమం.

తనకు చాలా జాలిగా ఉంటుంది, అతను పాపం ఆ అవస్థలు పడడం చూస్తుంటే! పెళ్ళి చేసుకుంటే అతనికా వంట పని తప్పుతుంది. కానీ అతనికి పెళ్ళి అవాలంటే ముందు అతని చెల్లెలి కవాలి. వాళ్ళ చెల్లెలి పెళ్ళికోసం ఎంతో పొదుపుగా గడుపుకుని- సరయిన తిండీ, బట్టా కూడా లేకుండా, డబ్బు పోగు చేస్తు న్నాడట!

చాలాసార్లు తనతో చెప్పాడు.

పావనికి ఆశ్చర్యంగా ఉంటుంది. ప్రతి కుటుంబానికీ ఓ సమస్య.

తమ కుటుంబానికి తన పెళ్ళి ప్రధాన సమస్య. రత్నాకర్‌కి వాళ్ళ చెల్లెలి పెళ్ళికి కావలసిన డబ్బు పోగు జెయ్యడం సమస్య. పక్క వాటాలో ఉన్న బేగం వాళ్ళకు ఏ పూట కాపూట గడవడం సమస్య. ఆమె భర్తకు ఉద్యోగం లేదు.

రత్నాకర్ పక్క వాటాలో ఉంటున్న కుటుంబానికి వాళ్ళ ఎని మిదేళ్ళ పిల్లడే ఓ సమస్య. వాడి కేదో జబ్బు. దానికి పెద్ద ఆప రేషన్ చేయాలట. అందుకు డబ్బు లేదు.

ఆపైన ఉన్న కిరణ్‌కుమార్ పరి స్థితి మరీ ఘోరం. ఉన్న ఉద్యోగం పోయింది. అప్పటి నుంచీ రోడ్డున పడ్డాడు. రోజూ ఉదయం నుంచీ

రాత్రి వరకూ ఉద్యోగం కోసం తిరగడమే పని.

ఆ పక్క వాటాలో ఉన్న భార్యాభర్తల సమస్య మరోటి! అతనికి భార్యమీద అనుమానం. ఆఫీసుకి వెళ్ళేప్పుడు ఇల్లు తాళం వేసి వెళ్తాడు. మళ్ళీ సాయంత్రం వచ్చి తీస్తాడు. ఆమెను చావగొడతాడు. ఆమెకా పరిస్థితి ఓ సమస్య. ఇంకో వాటాలో ఉన్న వారికి పిల్లలు పుట్టటం లేదు. అదే సమస్య వారికి.

వీళ్ళందరినీ చూసినప్పుడల్లా తన కనిపిస్తుంటుంది- అసలీ సమస్యలకు పరిష్కారా లుంటాయా అని!

తన అనుమానం విని తల్లి ఖండితంగా చెప్తుంది.

"ప్రతి సమస్యకూ- ఏదోక పరిష్కారం ఉంటుందే పిచ్చిదానా! కాలం తప్పకుండా పరిష్కరిస్తుంది అన్నింటినీ!"

తనకామె మాటల మీద నమ్మకం పోయింది. ఎందుకంటే గత అయిదారేళ్ళనుంచీ అందరి సమస్యలూ అలాగే ఉండి పోయాయి.

తనకు పెళ్ళి కాలేదు. రత్నాకర్ చెల్లికి పెళ్ళికి సరిపడే డబ్బు పోగడలేదు.

బేగం వాళ్ళ దుస్థితి మారలేదు. కిరణ్‌కుమార్‌కు ఉద్యోగం దొరక

## పథకం

ఒక కాన్వెంటు స్కూలు టీచర్, విద్యార్థి తల్లికి ఈ విధంగా ఉత్తరం వ్రాసి పంపింది- "అమ్మా! మీ అబ్బాయి స్కూలులో ఆడపిల్లల ప్రక్కనే కూర్చుంటున్నాడు. వారితోనే ఆటలు ఆడుతూ ఉంటాడు. మీ అబ్బాయికున్న ఈ అలవాటును మాన్పించడానికి నేనొక పథకాన్ని సిద్ధం చేశాను. మీ అభిప్రాయాన్ని తెలియజేయవలెను."

విద్యార్థి తల్లినుండి ఈ విధంగా సమాధానం వచ్చింది- "దయచేసి మీ పథకాన్ని ముందుగా నాకు తెలియజేయవలెను. దానిని నేను మా శ్రీవారిపై ప్రయోగిస్తాను."

—కల్‌సుమ్‌బీ.

## ఒకటే గుర్తు!

ఇన్‌స్పెక్టర్: మిమ్మల్ని అల్లరి పెట్టిన ఆ రోమియో ఎలా ఉంటాడమ్మా?

ఆమె: ఒకటే గుర్తు ఉందండీ! ఆ వెధవకు ముందున్న రెండు పళ్ళూ ఉండవు.

—కల్‌సుమ్‌బీ.

లేదు. రత్నాకర్ పక్కవాటాలో ఉన్న పిల్లాడి జబ్బుకి ఆపరేషన్ చేసేందుకు ఏ డాక్టరూ ముందుకి రావటం లేదు. పైన ఉన్న భార్యా భర్తల గొడవ అలానే ఉంది. భార్యను అనుమానం కొద్దీ మరిన్ని బాధలు పెడుతున్నాడతను.

పిల్లలకోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా మరో జంటకు పిల్లలే పుట్ట టంలేదు.

కానీ హఠాత్తుగా తల్లి మాటలు నిజమై కూర్చున్నాయి.

అందరి సమస్యల్నీ కాలం ఇట్టే పరిష్కరించేసింది.

తనకో సంబంధం కుదిరిపోయింది. ఎలాగోలా అప్పులు చేసి, నగలమ్మి తన పెళ్ళి జరిపించేరు. రత్నాకర్ పోగుజేసిన డబ్బుతో అతని చెల్లె లికికూడా పెళ్ళిచేయగలిగాడు. తనూ పెళ్ళి చేసుకున్నాడు. బేగం భర్తకు మస్కట్ లో ఉద్యోగం దొరికింది.

### ప్రశ్న- జవాబు

భార్య: ఏమండీ! ఇప్పుడెళ్ళిన ఆమెను చూశారా?

భర్త: ఎవరూ, 'ఎర్రచీర, ఎత్తు పళ్ళు, చింపిరితల, పెద్దపెద్ద కళ్ళూ, పొట్టిజడగల ఆవిడేనా?' నేనుసరిగా చూడలేదు. ఏమిటి సంగతి?

—కుల్ సుమ్‌బీ.

వెంటనే వెళ్ళిపోయాడతను. నెలకు వెయ్యి రూపాయలు బేగంకు పంప గలుగుతున్నాడు.

రత్నాకర్ పక్కవాటాలోని కుటుం బం వాళ్ళ అబ్బాయికి ఎలాగోలా గవర్నమెంట్ హాస్పిటల్లోనే ఆపరే షన్ చేయించారు.

మరో వాటాలో ఉన్న దంపతులకు పాపాయి పుట్టడంతో ఆమె మీద అనుమానం తాత్కాలికంగా పోయిందతనికి. ఆఫీస్ కెళ్ళేప్పుడు తలుపుకి తాళం వేయకుండానే వెళు తున్నాడు. వచ్చాక ఆమెను చావ గొట్టటం లేదు.

మరో వాటాలోని పిల్లలులేని దంప తులకు పాపాయి పుట్టబోతోందని డాక్టర్ చెప్పింది. కిరణ్‌కుమార్‌కి ఏదో కంపెనీలో టెంపరరీ జాబ్ దొరికింది. పావనికి చాలా రోజుల వరకూ ఆశ్చర్యంగానే ఉంది.

అమ్మ చెప్పింది నిజమేనా? ప్రతి సమస్యకూ నిజంగానే పరిష్కారం ఉంటుందా?

కొద్ది నెలల తర్వాత పావనికి మరో సమస్య ఎదురయింది. భర్త, అత్త మామలు పండక్కి కొన్ని సామా నులు, వస్తువులు తీసుకు రమ్మని పుట్టింటికి పంపించేశారు. అవి తేలేకపోతే తను పుట్టింటిలోనే ఉండిపోవాలి. ఆ స్తోమతు తనకు

లేకపోవడం చేతను తల్లిదండ్రుల దగ్గరే ఉండి పోయింది. అప్పుడే ఆ బిల్డింగ్‌లోని మిగతా వారందరి గురించి కూడా తెలిసిందామెకి.

రత్నాకర్ భార్య ఆ మేడ మీద అంత చిన్న ఇంట్లో జైల్లో ఉన్నట్లు కాపరం చేయడం తన వల్ల కాదనీ, వేరే ఇల్లు చూచే వరకూ, తను పుట్టింట్లోనే ఉండ దల్చుకుందనీ చెప్పి వెళ్ళిపోయిందట!

దాంతో మరో మంచి ఇంటికోసం వేట, ఆ ఇంటికి కట్టాల్సిన పగడీ, లేక అడ్వాన్సు అద్దె కోసం- మళ్ళీ పొదుపు. తనకోసం వంట చేసుకోవడం ప్రారంభమైందతనికి.

ఆ పక్క వాటాలో ఆపరేషన్ జరిగిన పిల్లాడికి, ఆపరేషన్ సరిగ్గా జరగలేదనీ, రాయవెల్లూర్‌కి తీసుకు వెళితే మంచిదని చెప్పారుట, డాక్టర్లు. వాళ్ళకి ఇంకొంచం పెద్ద సమస్య ఎదురయిందిప్పుడు.

బేగం కుటుంబ ఆర్థికస్థితి హఠాత్తుగా చక్కబడిపోయింది. భర్త మస్కట్ నుంచి పంపే డబ్బు బాంకులో నిలువ అవుతున్న కొద్దీ బేగంలో అశాంతి ఎక్కువవ సాగింది.

ఏదోక వ్యాపారం చేసుకోవడానికి తమ దగ్గర నిలవఉన్న డబ్బు చాలు ననీ, వెంటనే తిరిగి వచ్చేయమనీ,

ఎనర్జీ ఎక్కడుంది?

టీచర్: రాజూ! రైలు ఏ శక్తితో నడుస్తున్నదో చెప్పగలవా?

రాజు: చెప్పగలను సార్! గార్డు పచ్చ జెండా ఊపడం అనే శక్తి వల్ల.

—కుల్‌సుమ్‌బీ.

అతను లేకుండా తనకు ఎన్ని భోగ భాగ్యాలు సమకూర్చినా ఆ లోటు తీరదనీ పోరుతూ ఉత్తరాలు రాయ సాగిందామె. కానీ అతను ఆమెను ఖాతరు చేయటం లేదు.

కిరణ్‌కుమార్ పని చేస్తున్న మిల్లు మూతపడటంతో, అతను మళ్లీ రోడ్డున పడ్డాడు. ఇంక ఉద్యోగం దొరకటం అసంభవమని తెలిసి- ఏదోక చిన్న వ్యాపారం పెట్టాలన్న ఆలోచనలో ఉన్నాడట. అందు కోసం కనబడ్డవారినల్లా అప్పు అడుగుతున్నాడట.

అనుమానపు రోగం ఉన్న భర్త ఇప్పుడు మరింత దారుణంగా ప్రవర్తిస్తున్నాడట. వారికి పుట్టిన పాపలో తన పోలికలు లేవని వేరే ఎవరో వ్యక్తి పోలికలున్నాయని అనుమాన పడి ఇప్పుడు ఆమెనూ, పాపనూకూడా హింసిస్తున్నాడట. పాపనికి నవ్వొచ్చింది.

ఆనాటి సమస్యలన్నీ దూరమయి

**మరో బుడుగు**

అబ్బాయి: డాక్టర్ గారు, దెబ్బ తగిలింది. మందు వేయండి.

డాక్టర్ : ఎక్కడ తగిలింది బాబూ?

అబ్బాయి : ఇంటినుండి స్కూలు కెళ్ళే దారిలోనండి.

—కుల్‌సుమ్‌బీ.

పోయాయనీ-ఇక నుంచీ అందరూ హాయిగా, క్షేమంగా జీవితం గడుపు తారనీ అనుకుంది తను.

కానీ తన అభిప్రాయం తప్పు!

సమస్య అనేది అందరికీ శాశ్వతం. పరిష్కారం అనేది తాత్కాలికం! అంతే!

"అమ్మా!" తల్లి ఆ రోజు పిండి రుబ్బుతుంటే పిలిచింది పావని.

"ఏమిటి?" అడిగింది తల్లి.

"సమస్యలన్నిటినీ కాలమే పరిష్కరిస్తుందన్నావు కదమ్మా! మన బిల్డింగులో అందరికీ ఈ సమస్యలు మళ్ళీ చుట్టుకున్నాయిగా?"

ఆమె కొద్దిసేపు మాట్లాడలేదు.

"ఏమోనే! మా అమ్మ చెప్పిన మాటే నేనూ చెప్పాను. నాకు మాత్రమేం తెలుసు?"

పావనికి ఆమెను చూస్తే జాలి వేసింది.

అవును! తన తల్లికిమాత్రం ఏం తెలుసు?

"ఇప్పుడేదో యిబ్బందుల్లో ఉన్నామని-ఇక ఎప్పటికీ-ఇలాగే ఉంటామేమే? మరో అయిదారు నెలల్లో ఎక్కడోక్కడ అప్పుచేసి-మీ అత్తగారడిగిన సామానంతా కొని నిన్ను పంపించేస్తాం!" అందామె.

పావనికి అర్థమైంది.

తన భవిష్యత్తు గురించి ఆందోళన పడుతోందని భావించింది.

నిజానికిత నేనాడో తన గురించిగానీ, తన భవిష్యత్తును గురించి గానీ ఆలోచించడం మానేసింది.

"ఆ వస్తువులు లేందే యిక్కడికి తిరిగి రావడానికి వీల్లేదు" అని భర్త, అత్తగారు ఆంక్షలు పెట్టినప్పుడే తనకు ఆ మనుషులమీద విరక్తి కలిగింది. ఆ బానిస జీవితం మీద అసహ్యం కలిగింది.

"నేనింక అక్కడికి వెళ్ళనమ్మా!" అంది పావని దృఢ స్వరంతో.

ఆమె ఆశ్చర్యపోయింది. నమ్మలేనట్లు పావని మొఖంలోకి చూసింది.

"వెళ్ళవా?"

"ఊహు!"

"ఎందుకు?"

"నా కిష్టంలేదు .."

"నిన్ను కొట్టారా?"

"చంపడం కన్నా హీనమైన పని ఇది-ఇలా పంపించడం!"

తల్లి కన్నీరు పెట్టుకుంది.

"తప్పదే తల్లీ-మన బ్రతుకులింతే-ఈ మగ వెధవలకు భార్య విలువ పాతికేళ్ళ సంసారం చేశాకగానీ తెలీదు. అంతవరకూ రంపపు కోత పెడతారు - మీ నాన్న మాత్రం సుద్దవా? మా నాన్ననూ అమ్మనూ ఇలాగే ఎప్పుడూ అది కావాలనీ, ఇది కావాలనీ, ఇదివ్వాలనీ ఏడిపించుకు తిన్నవాళ్ళే!"

పావనికి ఆశ్చర్యం కలిగింది.

"నాన్నకూడా అంతేనా? మరిప్పుడు వాళ్లలా గొంతెమ్మకోర్కెలు కోరుతున్నారని తిడుతున్నారెందుకు?"

"అదేనే మనిషి స్వభావం! అది అంతే!" కాలం గడిచిపోతోంది. తమ బిల్డింగ్‌లోని ఎవరి సమస్యలకయినా మళ్ళీ అది పరిష్కారం చూపుతుందేమో అని ఎదురు చూసింది పావని.

కాని ఎంతకాలం గడచినా ఆ జాడ కనిపించలేదు. 'ఇంక ఎంతకాలం గడచినా ఈ సమస్య ఇంతే' అని నిశ్చయించుకొనే సమయానికి హఠాత్తుగా మార్పులు ప్రారంభమైనయ్. మొట్టమొదట పరిష్కారం తనకే లభించింది.

హఠాత్తుగా రాత్రి ఎనిమిది గంటలకు కరెంట్ పోయింది. కొద్దిసేపు చూచి లాంతరు వెలిగించాలనుకుని అగ్గిపెట్టెకోసం వెదకసాగింది తను. తీరా అందులో ఒకే ఒకపుల్ల ఉంది. అది కాస్త గాలికి ఆరిపోయింది. చేసేదిలేక రత్నాకర్ గదికెళ్ళిందామె. అతనూ చీకట్లోనే కూర్చుని ఉన్నట్లున్నాడు-గది తలుపు తెరిచుంది.

"ఎవరు?" అన్నాడు తన అలికిడికి.

"నేనే" అంది తలుపు దగ్గర్నుంచి.

"ఏంటి పావనీ? చీకట్లో వచ్చావేమిటి?"

"అగ్గిపెట్టె కావాలి."

"నేనూ అది వెదకడం బద్ధకించే కూర్చున్నాను - చూస్తాను ఉండు" అంటూ వంటింటి వేపు వెళ్ళాడు. వంటింట్లో ఏవో గిన్నెలు అతని కాలికి తగిలి బోర్లాపడటం వినపడుతూనే ఉంది. ఓ గిన్నె దొల్లుకుంటూ వచ్చి ఆమె కాలి దగ్గర పడింది.

"ఇదేదో ఇక్కడికొచ్చి పడింది-" అందామె అది చేత్తో పట్టుకుని.

"కొంపదీసి కూరగిన్నె కాదుగదా?"

"ఏమో! చూడు" అది అందించ

### సీక్రెసీ?

చైనానుండి ఒకకుక్క ఇండియాకు వచ్చింది. "మీ చైనాలో నీకు తిండి సరిగా దొరకదా?" అనడిగింది ఇండియా కుక్క.

"మాంసాహారం చాలా దొరికేది."

"మరిక్కడికివలసెందుకొచ్చినట్లు"

"రోజుకు ఒకసారైనా మొరగాలన్పించి." చైనా కుక్క సమాధానం చెప్పింది.

—కులసుమ్‌బీ.

డానికి లోపలికి నడిచిందామె.
అతని చేయి తన చేతికి తగిలింది. అంతే! ఆ చీకట్లోనే అరగంటసేపు అతనిలో ఐక్యం అయాక అగ్గిపెట్టె లేకుండానే తనింటికి తిరిగి వచ్చింది,
ఆ రాత్రంతా నిద్రలేదు. తను ఎందుకలా చేసింది? ఎందుకు ప్రతి ఘటించలేక పోయింది?
మర్నాడు సాయంత్రం మళ్ళీ తన గది కెళ్ళినప్పుడు మాట్లాడాడతను. "మా ఆవిడకెలాగూనాతోసంసారం చేయడం ఇష్టంలేదు. ఆమెక్కా వలసినవన్నీ సమకూర్చడం నా తాహ తుకుమించిన పని! అందుకని మేం యిద్దరం విడాకులు తీసుకోవాలని నిర్ణయించుకున్నాం! నీకిష్టమయితే మనిద్దరం పెళ్ళి చేసుకుందాం!"
అందులో తనకు అనౌచిత్యం ఏమీ కనిపించలేదు.

దాంతో తామిద్దరి సమస్యా ఒకేసారి తీరిపోయింది. తామిద్దరికీ పెళ్ళయిన కొద్ది రోజులకే బేగం కిరణ్‌కుమా ర్‌తో లేచిపోయింది. ఆమెకు మగ తోడు కావాలి. భర్త మస్కట్ నుంచి డబ్బు పంపుతున్నాడే గాని తిరిగి రావడానికి నిరాకరిస్తున్నాడు. కిరణ్‌కుమార్‌కి డబ్బు కావాలి. బేగం డబ్బుతో ఏదయినా పెద్ద వ్యాపారం చేయాలని అతనాలోచన.
విధంగా వారిద్దరి సమస్యకూ పరిష్కారం లభించింది.
ఆ సమయంలోనే పిల్లాడి ఆపరే షన్ కోసం డబ్బు కావాలని తం టాలు పడుతున్న దంపతులసమస్య కూడా పరిష్కారమయిపోయింది. ఆపరేషన్ లేకుండానే ఆ కుర్రాడు చనిపోయాడు.
ఇక భార్యమీద అనుమానంతో భార్యనూ. పాపనూ కూడా కొట్టి హింసించే భర్తకు హఠాత్తుగా పక్షవాతం వచ్చింది.
అందువల్ల అతని ఉద్యోగం పోయింది. అతని బదులు అతని భార్యకే ఆ కంపెనీలో వేరొక ఉద్యోగం ఇచ్చారు. ఒకప్పుడుతాళం వేసిన గదిలో గడిపిన ఆమె-ఇప్పుడు కంపెనీలో వర్క్ చేసి వస్తోంది. అయినా అతను కిక్కురుమనడం లేదు. అనుమాన పడడంలేదు.
పిల్లలులేని దంపతులకు కవలలు పుట్టడంతో వారి సమస్యకూడా పరిష్కారమయిపోయింది.

పావనికి ఆశ్చర్యంగా ఉంది.
అందరి సమస్యలూ హఠాత్తుగా ఎలా పరిష్కారమయ్యాయి?
"కాలమే పరిష్కరిస్తుందన్న" తల్లిమాటలు జ్ఞప్తికొచ్చాయామెకి. కానీ తన అనుభవం మాత్రం వప్పు కోవడం లేదు.
సమస్యలు శాశ్వతం-పరిష్కారం

మాత్రం తాత్కాలికం-అన్న తన నమ్మకం నిజమేనా?
అయితే మళ్ళీ అందరికీ సమస్యలు పుట్టుకొస్తాయా? మళ్ళీ అందరూ పరిష్కారం కోసం అవస్థలు పడుతుంటారా?
అయినా ఇంత సంతృప్తికరంగా ఉన్న తమందరి జీవితాల్లో మళ్ళీ సమస్యలెలా పుట్టుకొస్తాయ్?
ఆమె చాలాసేపు ఆలోచించింది.
హఠాత్తుగా జవాబు తోచిందామెకి.
సమస్యలు పుట్టుకురావడం అతితేలిక!
ఉదాహరణకి తమకే పిల్లలు పుట్టకపోవచ్చు! లేదా తనకో, రత్నాకర్‌కో జబ్బు ముంచుకు రావచ్చు-లేదా ఇంకేవో లక్ష సంఘటనలు జరిగి సమస్య పుట్టుకురావచ్చు.
అలాగే బేగం, కిరణ్‌కుమార్ జీవితాల్లోకూడా సమస్య రావచ్చు. ఇద్దరి మధ్యా ఆమె పిల్లల మూలంగా మనస్పర్థలు రావచ్చు. లేదా అతను మరో అమ్మాయిని ప్రేమించవచ్చు. పెళ్ళి చేసుకోవాలనుకోవచ్చు.
ఎంతో కాలానికి కవల పిల్లలు పుట్టిన దంపతులకు వరుసగా మూడుసార్లూ మగ కవలపిల్లలే పుట్టటం-ఆడపిల్ల కావాలన్న కోరిక కోరికగానే మిగిలిపోవడం-
పక్షవాతంతో మంచం పట్టిన అనుమానపు భర్తకు జబ్బు నయం కానడం-తిరిగి నడవ గలగడం-మళ్ళీ భార్యమీద కేకలు-తిట్లు-
ఇలా మళ్ళీ క్షణంలో సమస్యలు పుట్టుకోడానికి బోలెడు ఆస్కారం ఉంది. అయితే వాటికి పరిష్కారాలు మాత్రం అంత తేలికగా దొరకవు. చాలాకాలం పడుతుంది.
అందుకని ఏ సమస్యా పుట్టుకోకముందే జీవితం అనుభవించాలి.
మరో సమస్య వస్తుందేమో అని ఆలోచిస్తూ కూర్చుంటే ఈ శుభ ఘడియలుకూడా దాటిపోతాయ్-
ఆ తరువాత మళ్ళీ కాలం చూపే పరిష్కారం కోసం ఎదురుచూడటం తప్పితే గత్యంతరం లేదు.
పావనికి జీవితం అర్థమయింది.
ఆ తరువాత ఆమె మళ్ళీ ఎప్పుడూ సమస్యల గురించి ఆలోచించలేదు, పరిష్కారం గురించి పట్టించుకోనూ లేదు.

)*(

---

వీలునామా

ఉపాధ్యాయుడు: లాయర్‌గారూ, అర్జంటుగా నేను వీలునామా వ్రాయాలండీ!
లాయరు: మీరు చాల ఆరోగ్యంగా కన్పిస్తున్నారు, వీలునామాకు అంత అర్జంటేమిటండీ?
ఉపాధ్యాయుడు: నన్ను ఇంటర్ పరీక్షలకు వాచరుగా వేశారు మరి.

—కులసుమ్‌బీ.